1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మే 20, 2024 | www.navatelangana.com

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు హాజరు కావాలి

నవతెలంగాణ-నేరడిగొండ

పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు మండలంలోని బుగ్గారం బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులో అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో స్పాట్ కౌన్సిలింగ్ హాజరు కావాలని ప్రిన్సిపల్ కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, టీసీ, మెమో, బోనఫైడ్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రము, ఫిజికల్ టెస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రెండు జతల జిరాక్స్‌లు, నాలుగు పాస్ ఫోటోలు, ధృవీకరణ పత్రాలు తీసుకొని కౌన్సిలింగ్ హాజరుకావాలని తెలిపారు. అంతేకాకుండా ఒకేషనల్ కు సంబంధించిన కౌన్సిలింగ్ కూడా అదే రోజు ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి పరీక్షలు లేకుండా స్పాట్ కౌన్సిలింగ్ హాజరై సీటును సంపాదించుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తునట్టు ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్, కళాశాల ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలివిడతలో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. అడ్మిషన్ తీసుకొనే విద్యార్థులు బోనాఫైడ్, ఎస్ఎస్‌సీ షార్ట్‌మెమోతో కళాశాలలో హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత యూనిఫాం, నోట్ బుక్స్, టెస్ట్ బుక్స్ పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రయివేట్ కళాశాలకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. కళాశాలలో లైబ్రరీ, ల్యాబ్‌తో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదాతకేదీ 'భరోసా'..!

- పంట సాగు చేస్తున్న రైతులకందని రైతు భరోసా సాయం
- ఉమ్మడి జిల్లాలో లక్ష ఇరవై వేలకుపైగా కౌలు రైతులు
- పెట్టుబడి సాయం లేక కౌలు భారంతో అప్పులు

సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించకుండా పోతోంది. వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు రైతు భరోసా లేకుండా పోయింది. గత ప్రభుత్వం కౌలు రైతులు లేనే లేరని తెగేసి చెప్పింది. ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి భరోసా సాయం అందిస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ మొదలు కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు చేసే రైతుల్లో 70 శాతం కౌలు రైతులే వున్నారు. ఏటా పెట్టుబడులు కూడా రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతును గుర్తించి, పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతం కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఇరవై వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారని అంచనాలు చెబుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందడం లేదు. భూములు కౌలుకిచ్చి పట్టణాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న భూయజమానుల ఖాతాల్లోకి ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయి. బ్యాంక్ రుణాలు, భీమా సొమ్ములు, పంట నష్ట పరిహారం గానీ, చివరకు ప్రభుత్వం అందించే పీఎం కిసాన్, రైతు భరోసా సొమ్ములు సైతం కౌలు రైతులకు చేరడం లేదు. దీనిపై రైతులు, రైతు సంఘాలు ఇప్పటికీ ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అసలు కౌలు రైతులే లేరని తేల్చి చెప్పి భూస్వాముల జేబుల్లో రైతు బంధు పైసలు జామచేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో కౌలు రైతులను గుర్తించి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఇలాంటి కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ కోసం అడుగులు పడలేదు. వానాకాలం పంట వరకు కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వం సాగు చేసే రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే డిమాండ్ పెరిగింది. దీనిపై ఎన్నికల కోడ్ ముగియగానే ఆందోళనలు చేసేందుకు రైతులు, రైతు సంఘాలు సిద్ధం అయినట్లు సమాచారం.



పంట సాగులో కౌలు రైతులే ఎక్కువ

కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీ ప్రకారం కౌలు కార్డులు జారీ చేసి కౌలు రైతులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు, భీమా, పంట నష్టపరిహారం అన్ని కౌలు రైతులకు వర్తింప జేయాల్సి ఉంది. ఈ వ్యవసాయ సీజన్ నుండే వర్తింప జేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. వాస్తవ పరిస్థితిలో పదుల, వందల సంఖ్యలో భూములున్న యజమానుల్లో 90 శాతం మంది తమ భూమిని కౌలుకు ఇస్తున్నారు. అదీ కూడా భూ స్వభావాన్ని బట్టి ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.25 వరకు కౌలు నడుస్తుంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు బ్రతుకు దెరువు కోసం అధిక ధరలకు భూములను కౌలుకు తీసుకుంటున్నారు. విత్తనం కాన్నుంది, ఎరువులు, కూలి ధరలు అడ్డగోలుగా పెరిగిన కాని అప్పులు తెచ్చి మరీ పంట సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. కానీ ఎలాంటి సాగు చేయని భూయజమానులకు మాత్రం రైతు భరోసా అందుతుంది. ఒక ఎకరం ఉన్న యజమానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వ రైతు భరోసా రూ.15 వేలు, కౌలు రూ.20 వేలు కలుపుకొని ఎకరాకు రూ. 41వేలు అందుతున్నాయి. అదే పంట సాగు చేస్తున్న వారికి మాత్రం ఎలాంటి పెట్టుబడి సాయం అందడం లేదు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మల్లేష్, రైతు గుడిపేట్.

నేను 18 ఎకరాలు కౌలు తీసు కున్నాను. ఎకరాకు రూ.20 వేల కౌలు చెల్లిస్తున్న. గత ఏడాది పంట సాగులో రూ.3 లక్షల నష్టం వచ్చింది. పోయిన ప్రభుత్వం ఎలాగో మమ్మల్ని గుర్తించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులను గుర్తించి భరోసా కల్పించాలి.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెంబి



చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి ఇటిక్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన సుంచు లస్మయ్య(41) మాల కుంటలో శనివారం రాత్రి చేపల వేటకు వెళ్లి ఎక్కువ లోతులోకి వెళ్లి మునిగిపోయి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్సై శంకర్ కేసు దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

శాంతికి భంగం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రజా శాంతికి భంగం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని రాచాపూర్, చామన్‌పల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులకు రాబోవు స్థానిక ఎన్నికల పట్ల, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిపించారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకొని, బైండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, సీసీ కెమెరాల ప్రాధాన్యత గురించి, గ్రామస్తులకు వివరించారు.

హోరాహోరిగా ఎన్‌పీఎల్ ఫైనల్ మ్యాచ్



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉట్నూర్ ఫైటర్ క్రికెట్ క్లబ్, నాగల్ కొండ క్రాంతివీర్‌ల మధ్య హోరాహోరిగా కొనసాగింది. ఇందులో ముందుగా ఉట్నూర్ టీం బ్యాటింగ్ చేయగా, నాగల్‌కొండ టీం ఆలౌట్ అయి 20 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదటి విజేతగా ఉట్నూర్ రూ.20 వేల బహుమతి, రెండో బహుమతి నాగల్‌కొండ రూ.10 వేల తీసుకుంది.

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఎస్ఆర్‌డీజీ పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈనెల చివరిలో హైదరాబాద్ వేదికగా నెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే ఆదివారం జిల్లా జట్టు ఎంపికను ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో నిర్వహించారు. సెలక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. మెన్, ఉమెన్ విభాగాల్లో జిల్లా జట్టు ఎంపికైందని, హైదరాబాద్‌లో జరిగే టోర్నమెంట్‌లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పాఠశాల ప్రిన్సిపల్ క్రాంతికుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతం, పేట కార్యదర్శి స్వామి, హ్యాండ్ అసోసియేషన్ కార్యదర్శి హరిచరణ్, ఉపాధ్యక్షురాలు జ్యోతి, రూపేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ రిమ్స్ సబ్ స్టేషన్‌లోని టీచర్స్ కాలనీ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని టీచర్స్ కాలనీ, రిక్షా కాలనీ సంజయ్‌నగర్ కాలనీలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

బేల : మండల కేంద్రంతో పాటు చెప్రాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33 కేవీ, 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్నీ విద్యుత్ వినియోగదారులు గమనించగలరని విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ ప్రకటనలో తెలిపారు.

మచ్చలేని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు సుందరయ్య

- సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు నిర్మించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మచ్చలేని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన స్ఫూర్తితో కమ్యూనిస్టు కార్యకర్తలు పోరాటాలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సభను సీనియర్ నాయకులు బండి దత్తాత్రి అధ్యక్షతన పట్టణంలోని సుందరయ్య భవనంలో ఘనంగా నిర్వహిచారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ దక్షణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మత సుందరయ్య అని కొనియాడారు. సీపీఎం తొలి జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా సీపీఎం పార్టీని విస్తరింపచేశారన్నారు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడిగా దేశ అభివృద్ధికి నిర్మాణాత్మక పాత్రను పోషించారని అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్ పైన వెళ్లిన నిరాడంబరతకు మారుపేరుగా నిలిచిరాన్నారు. అగ్రకులంలో పుట్టిన అణగారిన వర్గాలకోసం పరితపించిన వ్యక్తి అని, అంటరాని తనానికి వ్యతిరేకంగా తన ఇంట్లోనే పోరాటం ఆరంభించిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. నేటి తరం కమ్యూనిస్టు కార్యకర్తలు సుందరయ్యను ఆదర్శంగా తీసుకోని పని చేయాలని అన్నారు. నేటి పాలకుల అవినీతి రాజకీయాలు, కులం, మతం పేరుతో జాతిని విడదీసే పాలనకు వ్యతిరేకంగా కార్మిక వర్గ ఐక్యతను చాటే పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల, ఎం.గంగన్న నాయకులు అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న లంక జమున, కోవ శకుంతల పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు

ధాన్యపు కుచ్చులు కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

మండల సమాఖ్య వారు తయారు చేసిన ధాన్యపు కుచ్చులను అందరూ కొనుక్కోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ఆదివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, నిర్మల్ మండల సమాఖ్య తరపున డీఆర్డీఓ విజయలక్ష్మీ ఎస్పీకి వరి ధాన్య కుచ్చులను బహుకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పూర్వ కాలములో ప్రతి రైతు తన పొలంలో వేసిన పంట కోతకు వచ్చిన సమయంలో కొద్ది మొత్తంలో వరి కంకులను కోసి ఒక్క కుచ్చు లాగా తయారు చేసి, పక్షుల కోసం తమ ఇంటిముందు వేలాడదీస్తారు. ప్రతి రోజు పక్షులు ముఖ్యంగా పిచ్చుకలు ఆ కుచ్చు మిద వాలి తింటూ ఉండేవి. అలా పక్షులతో కలకల లాడే లోగిల్లని లక్ష్మి స్వరూపంగా ప్రతి ఒక్కరూ బావించే వారు. కాలక్రమేనా కొడవళ్లతో వరిని కొయటం కనుమరుగైంది. ఇప్పుడు నిర్మల్ మండల సమాఖ్య ద్వార చేపట్టిన సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న వరి కంకులతో వీ ళ్ల ప్రతినిదుల ద్వారా కోడవళ్లతో కోయించి శుభ్రపరచి అట్టి కంకులను ఒక ప్రత్యేక అల్లిక ద్వార కుచ్చుగా తయారు చేశారు. ఇలా తయారు చేసిన కుచ్చులను ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం లలో ఉంచారు. కొన్ని రాష్ట్రాలలో గృహ ప్రవేశాలకు, మరికొన్ని వేడుకల్లో బహుమతులుగా ఇస్తారు. ప్రతి ఒక్కరూ ఈ కుచ్చులను కొనాలని, పక్షులకు ఆహారం ఇస్తూ, ప్రకృతిని కాపాడాలని కోరారు. వీటిని కొనాలనుకొనేవారు సంతోష్ 9652004859, రవి 9949123090లను నిర్మల్ మండల సమాఖ్యను సంప్రదించాలని సూచించారు.

కెమికల్ మామిడిపండ్లను తరలిస్తున్న ఆరు లారీలు సీజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిబంధనలకు విరుద్ధంగా మామిడి పండ్లను కృత్రిమంగా మాగబెట్టే పద్ధతిలో అత్యధిక మోతాదులో రసాయనాలను వినియోగిస్తున్నారని కంజూమర్స్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. మామిడి పండ్లను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్తర భారతానికి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు జాతీయ రహదారిపై దేవాపూర్ చెక్ పోస్టు వద్ద ఆరు లారీలను పట్టుకున్నారు. ఆదివారం జోనల్ అసిస్టెంట్ ఫుడ్ సెఫ్టీ కమిషనర్ అమృతశ్రీ తో కలిసి లారీని మామిడి పండ్లను పరిశీలించారు. నిబంధనల మేరకు కెమికల్ మోతాదుకు మించి ఉండటంతో వాటిని ధ్వంసం చేసినట్లు ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. ఫుడ్ సెఫ్టీ అధికారులు వారి పనులను సక్రమంగా చేయని కారణంగా కృతిమంగా మామిడి పండ్లను నిబంధనలకు వ్యతిరేకంగా మగ్గిస్తు మార్కెట్లకు పంపుతున్నారని కంజూమర్స్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు ఆరోపించారు. అధికారులు చేయాల్సిన పనులు సక్రమంగా చేయని కారణంగా ప్రజలు క్యాన్సర్ లాంటి వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆర్గనైజేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. అధికారులు కూడా నిత్యం మార్కెట్‌లలో పర్యటిస్తు నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో చూడాలని కోరారు. లేని పక్షంలో అధికారులకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ, జిల్లా అధ్యక్షుడు దోమటి కిరణ్‌కుమార్, కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, శివ, హేమవతి, రమ, సురేందర్, సురేష్, రాకేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్

1997-98సంవత్సరములో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోన్ జడ్పీ హైస్కూల్‌లో చదివిన మిత్రులు నిర్మల్‌లోని ఓ ఫంక్షన్ హల్ లో కలుసుకొని అప్పటి అనుభవాలు, అనుభూతులు మననం చేసుకొన్నారు. బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చదుకొన్న రోజుల్లోని సంగతులను తమ ప్రసంగాల్లో వివరించారు. 25ఏండ్ల తరువాత కలుసుకొని ఆనందానుభూతులు పంచుకొన్నారు. విద్యార్థులు తమ పరిచయాలు చేసుకొన్నారు. పూర్వ ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, పత్తి శివ ప్రసాద్, మహేష్ చందర్, జి.రాజేశ్వర్‌లను శాలువా మెమోంటోతో సత్కరించారు. 25సంవత్సరాల తరువాత అందరూ కలుసుకొని వారి పాత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయతను పంచుకున్నారు.



ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ బసవేశ్వర జయంతిని వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బసవేశ్వర కమిటీ ఆధ్వర్యంలో బసవేశ్వర చౌక్ వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ పాల్గొని బసవేశ్వర కమిటీ సభ్యులతో కలిసి ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శివప్రసాద్ మాట్లాడుతూ బసవేశ్వర చేసిన కృషిని స్మరించుకుంటు ముందుకు సాగాలని అన్నారు. 12వ పార్లమెంటరీ వ్యవస్థాను స్థాపించిన మహనీయుడు బసవేశ్వరుడని అన్నారు. ఆ సమయంలో అనగారిణ వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరవలేనిదన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనిస్తు పేదలకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పార్థసారథి, ఈర్ల సత్యనారాయణ, బసవేశ్వర కమిటీ సభ్యులు శివప్రసాద్, అన్నదానం జగదీశ్వర్, కేశవ్, శివలింగ్, పరమేశ్వరయ్య, శివలీలా, గణపతి, పార్వతి, రేఖ, రుక్మిణి, చంద్రకంతయ్య, శివుడయ్య ప్రభాకరయ్య, హన్మండ్లు యాదవ్ పాల్గొన్నారు.

పంటచేలను చదును చేస్తున్న రైతులు

నవతెలంగాణ-లోకేశ్వరం



మృగశిర కార్తె సమీపిస్తున్న తరుణంలో మండలంలోని రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో పంటచేలను విత్తనాలను పెట్టడానికి నేలను చదును చేసుకుంటున్నారు. యాంసంగి పంట కోత కోసిన తర్వాత వ్యవసాయ క్షేత్రాల్లో వ్యర్థాలను తగులపెడుతూ, ట్రాక్టర్ల సహాయంతో దుక్కి దున్నడం మొదలు పెట్టారు. ఈ మృగశిర కార్తెలో రైతులు ఏరువాక సాగే కాలమని కూడా అంటుంటారు. ఈ కాలంలో రుతుపవనాలు విస్తరించి తొలకరి వర్షాలు పడగానే రైతులు పంటచేలలో పంటలు వేయడం ప్రారంభిస్తారు.

బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



వర్షాకాలం సమీపిస్తున్నందున బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొల్హారి గ్రామం వద్ద రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు చేపడుతున్న మేస్త్రీలను పిలిచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, త్వరలో బ్రిడ్జిని పూర్తి చేసి వర్షాకాలం ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వాటర్ క్యూరింగ్ ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సులు ఎరగని గిరి గ్రామాలు

- ఇప్పటికీ ఎడ్లబండి, ప్రయివేటు వాహనాలే దిక్కు
- అనేక మంది మహిళలకు మహాలక్ష్మి పథకం దూరం

నవతెలంగాణ-నార్నూర్



స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా అనేక గ్రామాల్లో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు ఎరగడం లేదు. కొన్ని గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు ఎక్కిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి మండలం అంటేనే అడవులు, కొండలు మారుమూల గ్రామాలు ఉండటంతో పల్లెలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికీ రవాణా సౌకర్యం ఎడ్లబండ్లు, ప్రయివేటు వాహనాలు ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్న ఆర్టీసీ సంస్థ బస్సును నడిపించేందుకు ముందుకు రావడం లేదు. ఈ సందర్భంగా పల్లె వెలుగు బస్సులు పేద ప్రజలకు ఉపయోగపడని విధంగా మారుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం అనేక మందికి ఉపయోగపడని విధంగా మారింది. నార్నూర్, గాదిగూడ మండలాల్లో మొత్తం 48 గ్రామపంచాయతీలు ఉండగా వీటికి అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఆర్టీసీ సంస్థ నార్నూర్, లోకారీ గాదిగూడ, మహారాష్ట్రలోని జీవితి, సెన్‌గావ్ గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు నడిపిస్తుండగా ఇంకా చాలా గ్రామాలు ఈ సౌకర్యానికి దూరంగా ఉన్నాయి. అడవుల జిల్లా కావడంతో కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగా లేదనే కారణంగా బస్సులు నడిపించపోగా మరి కొన్నింటికి రోడ్డు సౌకర్యం బాగున్న అక్యూపెన్సి రాదనే కారణంగా వీటికి నడిపించడానికి ముందుకు రావడం లేదు. ఇప్పటికీ ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రాలకు మండలాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లు, ఆటోలు, జీపులు ఇతర వాహనాల ద్వారా రావాల్సి వస్తోంది. నార్నూర్, గాదిగూడ మండలంలోని మెజారిటీ గ్రామాలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉంది. నార్నూర్ మండలంలోని పేరు గాంచిన పాట్నాపూర్, కొత్తపెల్లి(హెచ్)తో పాటు తదితర గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ఉన్న బస్సు సౌకర్యం లేని గ్రామాలు

జైనూర్ మండలంలోని పాట్నాపూర్‌కు గతంలో బస్సు వచ్చేది కాని ఇప్పు రోడ్డు ఉన్నాగాని రావడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బలాన్‌పూర్, నాగల్‌కొండ, మరపగూడ, ఇలియాస్ నగర్, పట్నాపూర్, గూడమామడ, కర్ణంగూడ, బాబల్‌గూడతో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. జాతర సందర్భంలో బస్సులు నడిపించిన అదికారులు అనంతరం నిలిపి వేశారు. దీంతో అటు వైపు గ్రామాల ప్రజలు మండల జిల్లా కేంద్రానికి రావాలంటే ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఇలాంటి గ్రామాలు ఉమ్మడి మండలంలోని చాలా ఉన్నాయని పేర్కొన్నారు.

ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు నడుపాలి

బంజారా యువసేనా మండల అధ్యక్షుడు జాదవ్ దత్త



ఉమ్మడి మండలంలోని చాలా గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు. రోడ్డు ఉన్న గ్రామాలకు అదికారులు బస్సులు నడిపించాలి. బస్సులు నడవక పోవడంతో ఉచిత బస్సు ప్రయాణానికి దూరమవుతున్నారు. అదేవిధంగా ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ముందుగా ఉట్నూర్ వయా పాట్నాపూర్ బాబల్‌గూడ వరకు బస్సులు నడిచేది. చాలా ఎండ్ల నుంచి ఈ వైపు బస్సు నడవడం ఆపేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు నడపాలి. దీనితో పాటు ఉమ్మడి మండలంలోని రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు అదికారులు సర్వే చేసి బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ, గిరిజన, గిరిజనేతర మహిళలు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా ఆర్టీసీ అధికారులు కృషి చేయాలి.

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి



నవతెలంగాణ-నిర్మల్

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్ మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడిగా, పార్లమెంటుకు సైతం సైకిల్‌పై వెళ్లి సాధారణ జీవితం గడిపి ప్రజల మన్ననలు పొందాడని కొనియాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి 10 లక్షల ఎకరాల భూములను పేదలకు సాధించిపెట్టిన గొప్ప విప్లవకారుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, తొడసం శంభు, పట్టణ నాయకులు డి. పోశెట్టి, చందుల సాయికిరణ్, సంతోష్, కుమార్, కనక పవన్ పాల్గొన్నారు.

'ప్రపంచంలో మొదటి తత్వ శాస్త్రవేత్త బుద్ధుడు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రపంచంలో మొదటి సారిగా తత్వ శాస్త్రాన్ని భోదించి ప్రజలకు సుఖ సంతోషాలను కల్పించింది గౌతమ బుద్ధుడని రేవంత్ భంతేజీ అన్నారు. ఆదివారం చిచ్ధరి గ్రామంలోని బుద్ధ విహార్‌లో కొనసాగుతున్న శ్రామనీర్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుద్ధుడు భోదించిన అర్యసత్యాలను తెలుసుకొని, పంచశీల్, అష్టాంగమార్గాలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శిభిరం నిర్వహకులు, గ్రామ అధ్యక్షులు వాగ్మారే గౌతం, కార్యదర్శి వినోద్ టిగోటే, సభ్యులు సంజీవ్ గైకాంమ్లే, సదానంద్ గైకాంమ్లే, యూత్ అధ్యక్షులు గజానంద్ కోకటే, ఉపాధ్యక్షులు ధన్‌రాజ్ టిగోటే, కోశాధికారి రాష్టపాల్, సభ్యులు సిద్దార్థ్, నితిన్ వాగ్మారే దీనబందు పాల్గొన్నారు.

బైంసాలో అంతర్‌రాష్ట్ర గౌడ వధూవరుల పరిచయ వేదిక



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని స్థానిక గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర కౌండిన్య గౌడ వధూవరుల పరిచయ వేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన రేకుల్వార్ శుభం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యుగంలో విద్య ఒక్కటే మనిషి ఉన్నతికి ఎల్లవేళలా సహకరిస్తుందని తల్లిదండ్రులు విద్య విషయంలో తమ పిల్లలకు చిన్నప్పటినుండే మెలుకువలు పొందేలా కృషి చేయాలని అన్నారు.

రేకుల్వార్ శుభం గౌడ్‌కు ఘన సన్మానం..

2023 యూపీఎస్సీలో 790వ ర్యాంకు పొందిన రేకుల్వార్ శుభం గౌడ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తెలంగాణ గౌడ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు గోవింద్ బాబాగౌడ్ కొండల్వార్, బొల్లం నర్సాగౌడ్, కొండ గంగాధర్‌గౌడ్, గొడిసెల పండరిగౌడ్, సుధగోని శ్రీనివాస్‌గౌడ్, కిన్వట్ బాలాజీ కిషన్‌రావు, బోథ్ గోడిసెల రమణ గౌడ్, గోపీగౌడ్, ఫణీందర్ గౌడ్, శివిని బాలాజీ అల్లేవార్, దొర రామ్‌నాథ్‌గౌడ్, బిలొల్ల శంకర్‌గౌడ్, హైదరాబాద్ గౌడ హాస్టల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గున్నాల వెంకట నర్సాగౌడ్, తెలంగాణ గౌడ సంఘం అదిలాబాద్ అధ్యక్షులు గున్నా రామకృష్ణ గౌడ్, ధర్మాబాద్ కు చెందిన మాజీ అగ్రికల్చర్ డైరెక్టర్ జంగంపల్లి రమేష్‌గౌడ్, కార్యక్రమం నిర్వాహక సభ్యులు కొండ సత్యనారాయణగౌడ్, రాయఫల్వాడ్ కాశీనాథ్‌గౌడ్, మహరాష్ట్ర, తెలంగాణకు చెందిన వారు పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- గురువులకు ఘన సన్మానం

నవతెలంగాణ-భైంసా



పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1990-91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనానికి వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాలుగా, న్యాయవాదులుగా, రాజకీయ నాయకులుగా వ్యాపారులుగా, వ్యవసాయదారులుగా పనిచేస్తున్న ఆ బ్యాచ్ విద్యార్థులందరూ పాల్గొని తన చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆనాటి శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మావతి, తెలుగు ఉపాధ్యాయులు జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, ఆంగ్ల ఉపాధ్యాయులు డి.వినాయక్‌రావు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు దొంతుల గంగాధర్, కర్మచారి డి.రమేష్, పాల్గొన్నారు. వీరిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సిందే హనుమంతరావు, లక్ష్మణ్, కిరణ్మయి, వనిత, మధుర, మాణిక్, మధుకర్, ముత్యంరెడ్డి, వెంకటరెడ్డి, మల్లికార్జున్ తదితరులు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణతో జీవితంలో ముందడుగు వేయగలుగుతున్నామని, ఉపాధ్యాయులు నేర్పిన చదువుతో సాఫీగా జీవితాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయుల రుణము తీర్చుకోవడం కష్టమైనప్పటికీ ఉడుతా భక్తిగా ఈ చిన్న కార్యక్రమం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు సన్మానించే అవకాశం కలిగినందుకు ఆనందంగా ఉందని అన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యానికి దోహదపడతాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని చందు నాయక్ తండాలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని, బ్యాటింగ్ చేస్తూ క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్యేశించి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. గెలుపోటములు సహజమని యువకులు పోటీ తత్వం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కవీందర్, బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సాయి చైతన్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేతకాని, మహర్ కులస్తుల సమస్యల పరిష్కారానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, అందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని నేతకాని, మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ఏండ్లుగా పోడు భూముల సమస్యను ఎదుర్కొంటున్నామని, సంఘం యువతకు స్వయం ఉపాధి కోసం ఎలాంటి రుణాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహర్‌ల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం నిజంగా అభినందనీయమని అన్నారు. తమ కుల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధి దిశగా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం తమపై సానుకూలత వ్యక్తం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కుల ధృవీకరణ పత్రాలను ఆర్డీఓ ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు భగత్ యాదవ్, ఘణశ్యామ్ దేవ్‌తాడే, రామారావు పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ మునేశ్వర్, జిల్లా నాయకులు గంగాధర్ కాయపక్, సిద్ధార్థ తెలంగ్, ప్రమోద్ కుమార్ షిండే, బండారి పోశన్న, జిల్లా యూత్ నాయకులు దూట రాజేశ్వర్, మునేశ్వర్ స్వప్నిల్, గణపతి లాడే, జాడి కొటేశ్వర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎయిడ్స్ రోగులను వివక్షకు గురి చేయకుండా ఆదరించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ గజానంద్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఎయిడ్స్ బాధితులకు సంఘీభావంగా, మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు వామన్ రావు, రమేష్, ఎల్టి రమణ చారి పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో గుట్టపై వెళ్లే రహదారి పక్కన ఆదివారం గ్రామ సర్పంచ్ మధుకర్ రాథోడ్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. బంజారా లంబాడి ప్రజలు సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో పయనించాలని సేవాలాల్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాథోడ్ రమేష్, రాథోడ్ సురేష్ నాయక్, జాదవ్ పరశురామ్, చౌహాన్ మునిరాం, చౌహాన్ కిషోర్, జాదవ్ ఆనంద్ రావ్, రాథోడ్ శివాజీ, జాదవ్ శివాజీ, జాదవ్ గోకుల్, తానాజీ నాయక్, దినేష్ పటేల్, కారోబారి జాదవ్ పృథ్వీరాజ్ ఉన్నారు.

అవార్డుకు ఎంపికైన ఉదారి కవిత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెన్నెల సాహితీ సంఘమం సంస్థ ప్రతి సంవత్సరం అవార్డులను ప్రధానం చేస్తుంది. 2023 సంవత్సరానికి సంబంధించి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి కవిత సంపుటి అవార్డుకు ఎంపికైనట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, యాదగిరి గౌరవాధ్యక్షులు మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. అవార్డు కింద రూ.ఐదువేల నగదుతో పాటు ప్రశంస పత్రం అందజేస్తామని తెలిపారు. జూన్ నెలలో సిద్ధిపేటలో ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 60 కవితలు ఎంపికయ్యాయని అందులో ఉదారి నారాయణ కవిత్వం ఒకటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డుకి ఎంపికైన నారాయణను పలువురు అభినందించారు.

సంఘ బలోపేతమే లక్ష్యం

నవతెలంగాణ-భైంసా

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరమే పరమావధిగా భావించి, పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శంకర్ అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బిలో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతంతో భాగంగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న చక్రాలహరి ప్రసాద్‌ను నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పెద్దకాపు సత్యనారాయణను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతీ సత్యనారాయణ జారీ చేసిన నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణలో భాగంగా ఈనెల 16వ తేదీన వేతన సవరణ సంఘం చైర్మెన్ శివశంకర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని మూడు, నాలుగు కేటగిరిల ఇంటి అద్దె పెంపుకు నివేదించడం జరిగిందన్నారు. ఆటోమెటిక్ అడ్వాన్సును 6, 12, 18, 24 బదులుగా 5, 10, 15, 20, 25గా అమలు పరచాలని కోరామని అన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో పద్దు కింద వేతనాలు అందించాలని సూచించామని అన్నారు. ఉపాధ్యాయులకు టైం స్కేలను అమలుపరచాలన్నారు. ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు, హిందీ, పీఈటి పోస్టులను గ్రేడ్ వన్‌గా ఉన్నతీకరించాలన్నారు. గ్రాట్యూటీని రూ.16లక్షల నుంచి 25 లక్షలు గా ఉన్నతీకరించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి సంఘం కృషి చేయడం జరుగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ దరఖాస్తులు తక్షణమే పరిశీలించి, ఉపాధ్యాయుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని చేసిన పోరాటానికి సంబంధిత శాఖ అధికారులు అంగీకరించడం జరిగిందన్నారు. త్వరలోనే డబ్బులు ఉపాధ్యాయుల ఖాతాలో జమ అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బుధ్ధోళ్ల చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు సాయన్న పాల్గొన్నారు.

మహారాష్ట్ర రైతులకు విత్తనాలు అమ్మొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆదిలాబాద్‌కు అనుకొని ఉన్న మహారాష్ట్ర రైతులకు విత్తనాలు అమ్మవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తన ఛాంబర్‌లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. విత్తనాల కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నామని విత్తనాల సరఫరా సరిగ్గా జరగడం లేదని అధికారులపై డీలర్లు ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ విషయమై పుల్లయ్య మాట్లాడుతూ విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇక్కడ డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను మహారాష్ట్ర రైతులకు విక్రయించవద్దన్నారు.

డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలకు తప్పకుండా హాజరు కావాలి

నవతెలంగాణ-బేల

కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండో, మూడో, నాలుగో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జూన్ ఒకటో తేది నుంచి ఉంటాయని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వేముగంటి వరప్రసాద్ రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని, హాజరు కానివారు ఫెయిల్ అవుతారని పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 1 నుంచి నిర్వహించాలని విశ్వ విద్యాలయ అధికారులు తిరుమలదేవి ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు.

ఎంపీ లక్ష్మణ్‌ను కలిసిన నగేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్‌ను ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ కలిశారు. ఆదివారం హైదారాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకేను అందించారు. ఈ సంద్భంగా ఎన్నికలు తీరుపై ఇరువురు కాసేపు చర్చించారు. బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | మే 20, 2024 | www.navatelangana.com

సేవారత్న నేషనల్ అవార్డుకు సాయి కుమార్ ఎంపిక

నవతెలంగాణ-దహేగాం



మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన వెలిశాల సాయి కుమార్ సేవారత్న నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డుకు ఎంపిక చేసి ఆహ్వాన పత్రాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్ నల్ల రాధా కృష్ణ అందజేశారు. మహారాష్ట్రలోని పూణేలో జూన్ 10న అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూలే అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించిన మహాత్మ జ్యోతి భా పూలె జాతీయ అవార్డును బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ అందుకున్నారు. ఆదివారం ఆయనున్న బీజేపీ నాయకులు, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగేల నాగేశ్వర్ రావు ఆయన నివాసంలో సత్కరించి అభినందించారు. మహాత్మా జ్యోతి భా పూలె సావిత్రి భాయి పూలె ఆలోచన సిద్ధాంతంతో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమలు చేపట్టాలని ఈ సందర్భంగా జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ బొమ్మెన ప్రసాద్ గౌడ్, బీసీ సంఘం నాయకులు కోట వెంకన్న, మాజీ కో ఆప్షన్ మెంబర్ ముషీరోద్దీన్, గాజుల సత్తన్న, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయి కృష్ణ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతన వెతలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- ముగియని మున్సిపల్ 'పంచాయతీ' పంపకాలు
- కార్మికుల పంపకాలపై మల్లగుల్లాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

"రెక్కాడితే గాని డొక్కాడని" స్థితిలో ఉన్న ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికుల పరిస్థితి జీతాలు రాకపోవడంతో దారుణంగా తయారైంది. గతంలో పంచాయతీగా ఉండగా పంచాయతీ అధికారులు కార్మికులకు ఒక్కోసారి నెల రోజులకు లేదంటే రెండు నెలలకు తప్పనిసరిగా వేతనాలు ఇచ్చేవారు. అయితే పంచాయతీ నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారడంతో కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీగా మారినందుకు సంతోషపడాలో..? వేతనాలు రానందుకు దు:ఖపడాలో..? అర్థం కాని పరిస్థితుల్లో కార్మికులున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న వేతన వెతలపై ప్రత్యేక కథనం.



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం



పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల వేతన వెతలు..

ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ నుండి గత ఫిబ్రవరి 2న మున్సిపాలిటీగా మారింది. పంచాయతీ పరిధిలో 144 మంది మల్టీపర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి మూడు నెలల నుండి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి చెప్పాలో అర్థం కాక చేసే పని వదులుకోలేక జీవితాలు నెట్టుకువస్తున్నారు. ఇక అధికారులు స్పందించి వేతనాలు ఇస్తామోనని వేచి చూస్తున్నారు.

ముగియని మున్సిపల్ పంచాయతీ పంపకాలు..

గత ఫిబ్రవరి 2న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అదే క్రమంలో పంచాయతీ అధికారుల నుండి మున్సిపల్ అధికారులకు ఆస్తులు అధికారులు బదిలీ అయ్యాయి. అయితే మున్సిపాలిటీగా మారి మూడు నెలలు అవుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పంపకాలు జరగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇప్పటికే నిర్మాణాలు ఆగిపోగా కార్మికులకు వేతనాలు ఇవ్వడంపై కూడా స్తంభన కొనసాగుతోంది. అధికారులు నిర్లక్ష్యమో.. లేక బాధ్యత రహిత్యమో తెలియదు.

కార్మికుల పంపకాలపై మల్లగుల్లాలు..

ఆసిఫాబాద్ పంచాయతీ పరిధిలో శాశ్వత ప్రతిపాదికన, తాత్కాలిక ప్రతిపాదికన మొత్తం మీద 144 మంది పని చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో నిబంధనల ప్రకారం ప్రతి 10,000 మందికి 28 మంది మల్టీపర్పస్ వర్కర్లు ఉండాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆసిఫాబాద్ పట్టణ జనాభా దాదాపుగా 19 వేల వరకు ఉంటుంది. ప్రస్తుత జనాభా తీసుకుంటే 30 వేల వరకు చేరిందని అధికారుల అంచనా ఉంది. దీని ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో కేవలం 72 మంది మాత్రమే మల్టీపర్పస్ వర్కర్లు అవసరం. ప్రస్తుతం ఉన్న 144 మందిలో సగం మందిని తీసివేయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పడే రాజంపేట జీపీలో కొంతమంది అవసరముంటారు. అయితే వేతనాల్లో రెండింటి మధ్య తేడా ఉండడంతో కార్మికులలో ఎవరిని మున్సిపాలిటీలో ఉంచి ఎవరిని గ్రామపంచాయతీకి పంపాలి అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

శ్రీకాంత్, పంచాయతీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి



మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. కార్మికులు ప్రస్తుతం ఏవిధంగానైతే పనిచేస్తున్నారో మున్సిపాలిటీ తర్వాత అదేవిధంగా కొనసాగించాలి. ప్రస్తుతం పని చేస్తున్న వారికి మున్సిపాలిటీ వేతనాలు చెల్లించాలి.

రెండు మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తాం

భుజంగరావు, మున్సిపల్ కమిషనర్



మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను రెండు మూడు, రోజుల్లో చెల్లించడానికి ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటున్నాం. ప్రస్తుతం పంచాయతీ వేతనాలు చెల్లించి పంపకాల తర్వాత ఉన్న వారికి ఏరియర్స్ కూడా చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

దళితుల భూములు రక్షించాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమాయకమైన దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలమానపల్లి మండలం బాలాజీ అనుకోడా, రణవెల్లి శివారులో శంకరయ్య, సూర్యదాస్, కొండయ్య, సోమయ్య, ఋషి, విజయ్‌లకు చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని నాన్నయ్య, చిన్నక్క, ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, జయపాల్, పురుషోత్తం అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమించుకున్న పెత్తందారులు దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. లావుని పట్టాలను భూ యజమానులకు తెలవకుండానే అధికారులు కబ్జాదారులు ఒకటై పట్టాలను అక్రమంగా చేసుకున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేసేందుకు సమగ్ర విచారణ చేసి అర్హులైన వారికి పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు శంకర్, బాధితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజీవ్

నవతెలంగాణ-రెబ్బెన



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రయివేట్ పాఠశాలల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజీవ్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆయన అందించిన సేవలను గుర్తించి గత ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గతంలో చేసిన సేవలను గుర్తించి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవి బాధ్యతలను అప్పగించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలుపారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలను పరిష్కరించడానికి సంఘంతో పాటు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన వంతు సహాయ సహకారాలను అందించడానికి కృషి చేస్తానన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని హయత్ నగర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పీవీటీజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీటీజీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ తెలిపారు. హైదరాబాద్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని హయత్ నగర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ప్రవేశం పొందడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం, తోటి, మన్నె తెగలకు చెందినవారు 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హయత్ నగర్ బాలుర పీవీటీజీ కళాశాలలో ప్రవేశాలకు 9533978080, 9440398993 నెంబర్లను, బాలికల ప్రవేశాల కోసం 9908235978, 9640853914 సంప్రదించాలన్నారు. ఇంటర్‌తో పాటు జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నక్షత్ర ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్ సేవలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని నక్షత్ర ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్ సేవలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ సతీష్ కాలే ఆధ్వర్యంలో హాస్పిటల్‌లో రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించారు. అత్యాధునిక పరీక్షలకు ఎక్కడికో వెళ్లకుండా జిల్లా ప్రజల కోసం స్థానికంగా క్యాథ్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్టు వైద్యులు తెలిపారు. దీంతో జిల్లా ప్రజలకు సేవలు అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ అధ్యక్షులు ముడుపు దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్, ఖయ్యూమ్ పాల్గొన్నారు.



సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం

- సీపీఐ(ఎం) డివిజన్ కన్వీనర్ దుర్గం దినకర్
- ఘనంగా 39 వర్ధంతి వేడుకలు



ఆసిఫాబాద్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దక్షిణ భారత దేశ కమ్యునిస్టు ఉద్యమ నిర్మాత వీర తెలంగాణ సాయుధ రైతంగా పోరాట రథసారధి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని సీపీఐ(ఎం) డివిజన్ కన్వీనర్ దుర్గం దినకర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య చిన్నతనంలో అసమానతలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా 1932లో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి తన ఇంటినుండే పోరాటం మొదలు పెట్టారన్నారు. భూస్వాముల(రెడ్డి) కుటుంబంలో పుట్టిన ఆయన తన పేరు చివరన రెడ్డి తీసివేయడంతో పాటు తన యావత్ ఆస్తిని పేద ప్రజలకు పంచిన గొప్ప వ్యక్తి కొనియాడారు. పేద ప్రజల పిల్లల కోసం జీవితాన్ని అర్పించిన సుందరయ్య తనకు పిల్లలు కూడా వద్దనుకోవడం ఆయన వ్యక్తిత్వాన్ని తెలుపుతుందన్నారు. నేటి తరంలోని నాయకులకు ఆయన జీవితం ఒక గొప్ప ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ ఏరియా కమిటీ సభ్యులు గేడం టీకనంద్, కొరెంగ మల్‌శ్రీ, జాడి తిరుపతి, వడ్లూరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సీపీఐ(ఎం) పార్టీ మొట్టమొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీడిత ప్రజల నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తి దాయకమని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్, ముంజం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతి సభను పట్టణంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా, ఆదర్శనేతగా, అజాతశత్రువుగా పిలవబడే సుందరయ్య నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయుడన్నారు. పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్షనేతగా మన్ననలను పొందారని గుర్తు చేశారు. ప్రజా సేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగజీవని, దేశంలో విలువలతో కూడిన రాజకీయాలకు తిలోదకాలిస్తున్న నేటి భూర్జువ పార్టీలు సుందరయ్య వంటి మహానేత నిరాడంబరతను, త్యాగనీతిని అలవర్చుకోవాలన్నారు. తన యావదాస్తిని పార్టీకి ఇచ్చి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై మతోన్మాదానికి వ్యతిరేకంగా క్రింది స్థాయి ప్రజల్లో మరిన్ని పోరాటాలను విస్తృతంగా నిర్వహించడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రాజన్న, జాడి మల్లన్న, సుధాకర్, సాయిక్రిష్ణ, వసాకె సాయి, డికొండ నితీష్, సురేఖ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో సుందరయ్య నివాళులర్పించి నినాదాలు చేస్తున్న నాయకులు

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి : డీఎంహెచ్ఓ



ఎయిడ్స్ మృతులకు కొవ్వొతులతో నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ, ఆరోగ్య సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎయిడ్స్ రోగులను వివక్షకు గురి చేయకుండా ఆదరించాలని జిల్వా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం భట్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఎయిడ్స్‌తో నివసిస్తున్న వారికి సంఘీభావంగా, మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం మాట్లాడుతూ ప్రతి ఏడాది మే మూడవ ఆదివారం ఎయిడ్స్ మృతుల సంస్మరానర్థం కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్నమన్నారు. హెచ్ఐవీ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని కోరారు. హెచ్ఐవీ బాధితుల కోసం ప్రభుత్వ పరంగా అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ బాధితుల సంరక్షణలో స్వచ్ఛంద సంస్థలు కూడా విరివిగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ 2016 నుండి మార్చ్ 2024 వరకు 146389 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా 300 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. మందులు వాడుతున్న వారిలో 172 మంది ఆసరా పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ హెచ్ఐవీ నివారణ చర్యలు పాటిస్తూ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, అడ మెడికల్ ఆఫీసర్ వినోద్, దిశ సీఎస్ఓ రాజేష్, డీఎండీఓ సంతోష్, ఐసీటీసీ కౌన్సిలర్స్ సతీష్, హరీష్, రవీందర్, ఎల్‌టీ రఫి, రాజశేఖర్, చేతన స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సతీష్, శ్రీ సాయి మహిళా మండలి ప్రాజెక్ట్ మేనేజర్ ఈర్ల సునీల్, ఔట్ రీచ్ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎమ్ఆర్ఎస్‌లో ప్రవేశాలకు నేడే ఆఖరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 11వ తరగతి ప్రవేశాలకు 20వ చివరి తేదని ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాగజ్‌నగర్ ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ సాయిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కాగజ్ నగర్ లేదా ఉట్నూర్‌లలో సోమవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 24న ఉట్నూర్ కెవి కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజ కొనాల్సిందే

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు



నవతెలంగాణ-దహేగాం

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనాల్సిందేనని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని లగ్గాం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం కొనాల్సిందేనని అన్నారు. తప్ప తాలు లేకుండా యంత్రాల్లో వేసి ధాన్యాన్ని అమ్ముతున్నందున తరుగు లేకుండా వారికి పూర్తి మద్దతు ధర కల్పించాలని అన్నారు. వారం పది రోజుల్లో పూర్తి ధాన్యం కొనకపోతే రైతుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి గౌడ్, సీఈఓ బక్కయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలో సింగరేణి ఉన్నత పాఠశాలలో 1998-1999 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 42 సంవత్సరాల పూర్తయిన తరువాత ఒక చోట కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకలు సింగరేణి సీఈఆర్ క్లబ్లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 42 సంవత్సరాల తరువాత ఒక చోట చేరి ప్రస్తుతం చేస్తున్న పనులు ఇతర వాటి గురించి చర్చించుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనములు భాగంగా విద్యార్థులందరం కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒకరినొకరు పలకరించుకుండు తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సెల్ఫీలతో ఫోటోలు దిగారు.

జూన్‌లో ఖరీఫ్ రైతుబంధు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖరీఫ్ పంటకు సంబంధించి రైతు బంధు జూన్ నెలలో చెల్లించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధిక శాతం రైతులు పత్తి పంట పండిస్తారన్నారు. జూన్ మొదటి వారంలోనే వర్షాలు వస్తాయని వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలో జూన్ మొదటి వారంలోగా రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని కోరారు. పదేండ్లలో కేసీఆర్ సర్కారు సకాలంలో రైతులకు పెట్టుబడి అందించి వడ్డీ వ్యాపారుల దగ్గరకు రైతులకు వెళ్లకుండా చేసి ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా ఉంటామని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | మే 20, 2024 | www.navatelangana.com

కుల మతాలకు అతీతంగా అభివృద్ధి పనులు

నవతెలంగాణ-జైపూర్



ప్రజల ఆకాంక్ష మేరకు కుల మతాలకు అతీతంగా ప్రాంత అభివృద్ధికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫయాజోద్దీన్ అన్నారు. ఎన్నికలకు ముందు ఇందారం గ్రామ పంచాయతి పరిధి వాల్మీకి కులస్తుల అభ్యర్థన మేరకు లక్ష్మీదేవి ఆలయ నిర్మాణానికి హామీ ఇవ్వగా ఆదివారం స్లాబ్ పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వాల్మీకి కులస్థుల అభ్యర్థన పట్ల స్పందించి ఆలయ నిర్మాణానికి హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్మాణపు పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్ అన్నారు. ఆదివారం జన్నారంలో మీడియాతో మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాడిపత్రిలు అందుబాటులో లేక ధాన్యమంతా తడిసిందని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏదైతే ప్రభుత్వము క్వింటాకు రూ.500 ఇన్పుట్ సబ్సిడీ ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని ఇలా రైతులను మోసం చేయడం సరైనది కాదని అన్నారు. సమయానికి రవాణ చేయకపోవడంతో లారీల కొరత వల్ల రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

సుందరయ్య స్ఫూర్తితో భూ పోరాటం కొనసాగిద్దాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యుడు పైళ్ల ఆశయ్య
- ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి

నవతెలంగాణ-జైపూర్

అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో చెన్నూర్ శివారు బావురావుపేట్ శివారు భూపోరాటం కొనసాగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. సీపీఐ(ఎం) ఏరియా కమిటి ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని స్థానిక తాపీ మేస్త్రీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985 మే 19న తుదిశ్వాస విడిచిన పుచ్చలపల్లి సుందరయ్య జీవించి ఉన్నంత కాలం సమాజానికి మార్గదర్శిగా నిలిచారని గుర్తు చేశారు. రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో ఒక నమూన, నిదర్శనమని అన్నారు. నాటి రాజకీయాల్లో ఒక కొత్త మార్గాన్ని చూపిన వ్యక్తి సుందరయ్య అని అభివర్ణించారు. భారత దేశంలో దోపిడి, అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారని పేర్కొన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ముందుండి నడిపించారని పేర్కొన్నారు. 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి పది వేల గ్రామాలలో గ్రామ రాజ్యాలు నిర్మించిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. నేటికి ఇంటి జాగ లేనటువంటి పేదలు, సాగు భూమి లేని నిరుపేదలైన దళిత ఆదివాసి బలహీణవర్గాల ప్రజలకు ప్రభుత్వం భూమి పంపిణి చేయాలని అందుకోసం సుందరయ్య స్ఫూర్తిగా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మ, చెన్నూర్ ఇల్ల స్థలాల పోరాట కమిటి నాయకులు నగేష్, ఉమారాణి, సమ్మక్క, రాజేశ్వరి, చంద్రన్న, మారన్న, రమాదేవి, రేణుక పాల్గొన్నారు.



జైపూర్‌లో..

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య

జన్నారం : నిస్వార్థపరుడు సమాజాభివృద్ధి కోసం పరితపించిన మానవతా వాది పుచ్చలపల్లి సుందరయ్య ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని సీపీఐ(ఎం) మండలం నాయకులు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని రామాలయం వాడలో, సుందరయ్యనగర్ కాలనీలో వేరువేరుగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీపీఐ(ఎం) నాయకుడిగా సుందరయ్య నిరాడంబర జీవితాన్ని గడిపి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె బుచ్చయ్య, పోతు విజయ శంకర్, మగిడి జయ, అంబటి లక్ష్మణ్, పర్ల కనకయ్య, కె గంగారాం, పోతు విజయ, గుడ్ల రాజన్న, మధిర లక్ష్మి, కొండగుర్ల లింగన్న, అమ్మాయి(త్రివేణి) ఇంధన్‌పల్లి సత్యమ్మ, కోరుట్ల యశోద, గోనే లక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని సోమగూడెం శిశు మందిర్ క్రీడా మైదానంలో ఆదివారం వాకర్స్, క్రీడాకారుల ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వాకర్స్, క్రీడాకారులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్, క్రీడాకారులు సంకె రవి, బైరగోని సిద్దయ్య అజ్మీర శ్రీనివాస్, బోగె పోశం, ఎస్ శ్రీనివాస్, సదానందం, రాజలింగు, చిలుముల శ్రీనివాస్, చెన్నూరి శ్రీనివాస్, కౌశిక్, వర్షిత్, ప్రేంకుమార్, అనీల్ కుమార్, సాయి తేజ, చరణ్ పాల్గొన్నారు.

తాండూర్ : రైతాంగ సమస్యల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన నాయకుడు పుచ్చలపెల్లి సుందరయ్య అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దాగాం రాజారాం అన్నారు. ఆదివారం తాండూర్ ఐబి మండల కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, గుండు రమణారావు మరియు నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ సుందరయ్య 1913 మే 1 తేదీన జన్మించి 1985 మే 19న మరణించారని, ఆయన విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు విధానాలకు ఆకర్షితుడై, కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగి భారతదేశం మొదటి పార్లమెంట్లో ప్రతిపక్ష నేతగా, ఎమ్మెల్యేగా అనేక సేవలందించారని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందర రామిరెడ్డి అనే పేరుని సుందరయ్యగా మార్చుకొని భారత దేశ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, కుమారస్వామి, డూర్కె మోహన్, మిడివెల్లి రాజ్ కుమార్, పావురాల రాములు, పావురాల రాములు, రాజు, రాందాస్ పాల్గొన్నారు.

దండేపల్లి : పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కోయపోచగూడెం గిరిజన గ్రామంలో 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య భూసామ్య విధానాలతో పాటు దళితవాడల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సుందరయ్య చివరి శ్వాస వరకు ప్రజల కోసమే జీవించారని అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారధుల్లో సుందరయ్య ఒకరిని పేర్కొన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు రాజలింగు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్నారంలో..



కాసిపేటలో..



తాండూర్‌లో..



మంచిర్యాలలో..

కన్నుల పండువగా శ్రీనివాసుడి కళ్యాణం



నవతెలంగాణ-మందమర్రి

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి శ్రీనివాసుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో, అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగరేణి మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సవిత దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరి అనంత ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో బ్రహ్మోత్సవాలు మే 23 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎల్లందు క్లబ్ బంగ్లాస్ ఏరియాలోని సింగరేణి ఏరియా జీఎం మనోహర్ నివాసం నుంచి ఎదుర్కోలు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రజలంతా స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఇటీవల కలవేన సంపత్ కడుపులో పెద్ద పేగు ముడి పడటంతో కరీంనగర్‌లో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంపత్ మరణ వార్త తెలుసుకున్న స్థానిక శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదువుకున్న 1997లో 10వ తరగతి బ్యాచ్ తన తోటి స్నేహితులు వారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.30వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా పిల్లల చదువు కోసం మా మిత్ర బృందం అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి స్నేహితుల బృందం పాల్గొన్నారు.


20ఏండ్ల తర్వాత ఒకచోట చేరి



నవతెలంగాణ-మంచిర్యాల

20ఏండ్ల కిందట స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో చదివిన వారందరూ ఒకచోట చేరి వారి తాము చదివిన కళాశాలలోని జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. బీఎస్సీ మైక్రో బయాలజీ చదివి తహసీల్దార్, న్యాయవాది, ఉపాధ్యాయులుగా ఎదిగి ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఆదివారం పట్టణంలోని "వి" కన్వెన్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం జరిగింది. వివిధ స్థాయిలో స్థిరపడ్డవారు ఒక్కొక్కరుగా తమ అనుభవాలను పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. ఈ సందర్భంగా సహ విద్యార్థి మంచిర్యాల జిల్లా రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు మహేందర్‌ని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజేష్, మల్లాగౌడ్, రమేష్, నరేష్, స్రవంతి, స్వప్న, హారిక, అనిత, సురేష్ పాల్గొన్నారు.

కాళోజీ గ్రంథాలయంలో అన్నదానం



నవతెలంగాణ-తాండూరు

బెల్లంపల్లి పట్టణంలోని కాళోజీ గ్రంథాలయంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంసిద్ధం అవుతున్న నిరుద్యోగ యువతి యువకులకు ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 19వ రోజు వెంకట కృష్ణరెడ్డి సహకారంతో మాజీ కౌన్సిలర్ వంశీ కృష్ణారెడ్డి, పద్మరెడ్డి జ్ఞాపకార్థంగా అమ్మ ఒడి ఎన్జీఓ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల మధుకర్ అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ బ్రాంచి మేనేజర్ గన్నవరం సువర్ణ, మేదరి లక్ష్మణ్, ఇప్ప రవి పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువకులకు నేషనల్ అకాడమిక్ కన్స్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జేసీబీ డ్రైవింగ్ 3 నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి ద్యావంత్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం జాబ్ కల్పించడం జరుగుతుందని నెలకు రూ.25వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అలాగే ఇంటర్ విద్యార్థులు ఈ శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు ఈనెల 22వ తేదీ వరకు జిల్లాలోని న్యాక్ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9866565156 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా

నవతెలంగాణ-హాజీపూర్



నకిలీ విత్తనాలు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నకిలీ, కల్తీ విత్తన ముఠాల బారిన పడకుండా మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా విత్తనాల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాల చెలామని అవుతుందని దాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ రంగంలో దిగిందని తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు రైతులను మోసం చేసే వారిని గుర్తించి వారిపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోగల విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేయడం జరిగిందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటూ.. ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేయడం జరిగిందని నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలుకు జాబితా కూడా సిద్ధం చేశామన్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించి పనులు చేపట్టాలి

నవతెలంగాణ-జైపూర్



శ్రీరాంపూర్ ఓసీ విస్తరణలో భాగంగా గతంలో రామారావుపేట్-నస్పూర్ ఆర్ అండ్ బీ రోడ్డును పూర్తిగా ఎత్తివేశారు. ప్రస్తుతం రాజీవ్ రహదారి వరకు వ్యవసాయ భూముల మీదుగా ఉన్నటువంటి రోడ్డును ఇందారం డంపు కోసం ఎత్తివేసేందుకు సింగరేణి కుట్ర చేస్తుందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తొలగించడం తప్పదు అనుకుంటే ప్రత్యామ్నయంగా రోడ్డు నిర్మిస్తే తప్పా ఇప్పుడున్న రోడ్డును ముట్టుకోవద్దని గ్రామస్థులు, శివారు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌ను కలిసిన గ్రామస్థులు ఇందారం, శ్రీరాంపూర్ ఓపన్‌కాస్ట్ గనుల ఏర్పాటుతో గ్రామ పంచాయతి ఉనికిని కోల్పోయిందని తెలిపారు. ఓసీ గనుల కోసం వందల ఎకరాల్లోని వ్యవసాయ భూములు సేకరించిన సింగరేణి యాజమాన్యం ఇప్పుడు బాహ్యాప్రపంచానికి గ్రామాన్ని దూరం చేస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. ఒక్కటి తర్వాత ఒక్కటి అన్నట్లు ముందుగా భూములు లాక్కున సింగరేణి యాజమాన్యం ఆ తరువాత ఓసీ డంపులను ఊరు చివరికి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓసీ పేళుల్లతో ఏర్పడుతున్న శబ్ధ, వాయు కాలుష్యంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించిన గ్రామస్థులు రామారావుపేట్ నుండి రాజీవ్‌రహదారి వరకు గల రోడ్డును తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రోడ్డు తొలగింపుతో కలిగే ఇబ్బందులు ఇదివరకే సింగరేణి అధికారులకు వివరించినట్లు వెల్లడించారు. అయితే ప్రత్యామ్నయంగా సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మిస్తామని చెప్పుకొస్తున్న సింగరేణి అధికారులు గాలిలో మేడలు కడుతున్నారని ఆరోపించారు. సింగరేణి అధికారులకు ఎప్పుడు ఏవిధమైన అవసరం ఏర్పడినా ఏదో చేస్తామని చెప్పి మరేదో చేయడం పరిపాటిగా కొనసాగుతుందని అన్నారు. ఇందారం ఓసీ డంపు ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా పోస్తున్నందున గుట్టుచప్పుడు కాకుండా ఉన్న రోడ్డును మూసేసి మాకు దారి లేకుండా చేసే కుట్ర జరుగుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతి ప్రజల ఇబ్బందులు గుర్తించి జిల్లా అధికారుల ద్వార తమ సమస్యకు పరిష్కారం చూపించాలని స్థానిక తహసీల్దార్‌ను కలిసి కోరినట్లు గ్రామస్థులు నామాల తిరుపతి, యాదగిరి, వెంకటస్వామి, వెంకటేశం, మిట్ట మల్లేష్, కామెర శంకర్, బండారి శంకరయ్య, ముదాం తిరుపతి, విజయలక్ష్మి, ఐత శ్రీపాద్ తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలు సాధిస్తారు

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత లక్షాలు సాధించగలుగుతారని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. ఆదివారం మండలం లోని కవ్వాల గ్రామానికి చెందిన ఎల్పుల రాజేందర్ అనే విద్యార్థి, అజీమ్ ప్రేమ్‌జీ వారు నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి భోపాల్ యూనివర్సిటీ లో బీఏ హానర్స్‌లో సీట్ సంపాదించడం పట్ల ఆ గ్రామస్తులు ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, గ్రామ పెద్దలు తారుఫ్ అలీఖాన్, తైవార్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థి తండ్రి వేల్పుల శంకర్‌ని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవ్వాల మాజీ సర్పంచ్ రాథోడ్ కలిరం, బానోత్ శేషారావు, భారత్ గ్యాస్ మేనేజర్ నరేష్, నీలం శేఖర్, అంజాత్ పాషా, తుడుం శేఖర్, మైముత్ ఖాన్, సక్రు నాయక్, పోడేటి మల్లేష్, వంగా శ్రీను, బాదావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివేక్ వీడియో రిలీజ్ అవివేకం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలెగూర రాజ్‌కుమార్



నవతెలంగాణ-జైపూర్

ఇబ్బందుల్లో ఉన్న రైతులకు వెన్నుదన్నుగా నిలువాల్సిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అమెరికాలో ఉండి వీడియో రిలీజ్ చేసి అవివేకంగా వ్యహరించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలెగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. మద్దికల్ మాజీ ఎంపీటీసీ ఆతుకూరి రాముతో కలిసి ఆదివారం భీమారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు అవస్థలు పడుతున్న రైతులను పట్టించుకోకుండా అమెరికాలో తిరుగుతున్న ఎమ్మెల్యే రైతుల సమస్యకు పరిష్కారం చూపించకపోవడం బాధాకరమని అన్నారు. కొడుకును ఎంపీ చేయడం కోసం పార్లమెంట్ నియోజకవర్గంలో ఒకటికి రెండు సార్లు చక్కర్లు కొట్టిన ఎమ్మెల్యే రైతులు అవస్థలు పడుతుంటే అమెరికాలో తిరుగుతుండటం బాధాకరమని అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నష్టపోయిన రైతుల ఆవేధన విన్పించుకోవడానికి స్థానికంగా ఎమ్మెల్యే లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడితే తప్పా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇదే సమయానికి 80 శాతం వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయడం జరిగిందని, అకాల వర్షంతో తడిసిన ధాన్యం సైతం ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేసిన సంధర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో అధికారులతో మిల్లర్లతో ఎప్పటికప్పుడు సమిక్షా సమావేశాలు ఏర్పాటు ధాన్యం రవాణ, సరిపడా గన్నీ బ్యాగులు, అవసరాల మేరకు లారీలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. ఎన్నికలు తప్పా ప్రజల అవసరాలు, వారి అవస్థలు స్థానిక ఎమ్మెల్యే వివేక్ కుటుంబం పట్టించుకోదని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను కలిసి వారి ఇబ్బందులు తీర్చడం కోసం స్థానికంగా ఉండి చేయాల్సిన పనులు పక్కన పెట్టి వీడియో రిలీజ్ చేయడం ద్వార బాధిత రైతులకు భరోసా కలుగదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గం లాజర్, చింతం తిరుపతి, కలగూర రమేష్, అనపర్తి రవీందర్ పాల్గొన్నారు.